# రోగం కుదిరింది



ఆఫీసర్‌గారు ఇన్‌స్పెక్షన్‌కి వచ్చారు.

ఆయన చండశాసనుడని ప్రతీతి. అందువల్ల ఆఫీసులో అందరూ హడలిచస్తున్నారు.

సెక్షన్ ఆఫీసర్ గురునాథం మాత్రం నిబ్బరంగా, చిద్విలాసంగా ఉన్నాడు. అసలు ఆయన ఇన్‌స్పెక్ట్ చేసేది ప్రధానంగా అతని సెక్షనే! అతని సెక్షన్లో పని బకాయిలు కూడా బాగానే ఉన్నాయి. అయినా... అతను అంత ధైర్యంగా ఉండటం మిగిలినవారికి ఆశ్చర్యం కలిగించింది.

"ఏం బ్రదర్... ఈయన కోడిగుడ్డుకి ఈకలు లాగే రకమంట! రికార్డ్సు మహా జాగర్తగా చూసి ప్రాణం తీస్తాడట!!" శంకరరావు అన్నాడు కొంచెం కంగారుగా.

"చూడనీండి... అది వాళ్ళ డ్యూటీ! అందులో తప్పేముంది? తప్పులుంటే దిద్దుకుంటాం. ఫ్రాడ్స్ ఏమీ చేయలేదుగా!" - అని నవ్వుతూ అన్నాడు గురునాధం.

వచ్చిన రోజున మిగిలిన సెక్షన్స్ ఇన్‌స్పెక్షన్ పెట్టుకున్నాడు ఆఫీసర్. ఆయన- ముందు ఈ చిల్లరవి అయిపోతే ప్రధానంగా చూడవలసినవి తీరిగ్గా, చివరగా చూడవచ్చని భావించాడు. ఆ రోజంతా "ధాం... ధూం..." అంటూ నానా హడావిడి చేశాడు.

ఆ హడావిడి చూసి నవ్వుకోసాగాడు గురునాధం.

"ఇంతగా హడావిడి చేసేవాళ్ళు ఎప్పుడూ లంచగొండులుగా ఉంటారు. వాళ్ళకి కావలసినది ముట్టచెప్పాలని సూచించడానికే ఈ హడావిడి!" అంటూ మనస్తత్వ శాస్త్రవేత్తలాగ వివరించాడు శంకరరావుకి. 'ఇటువంటి వాళ్ళని బుట్టలో వేసుకోడం ఎంతసేపు?' అన్న ధీమాలో ఉన్నాడు అతను.

ఆ సాయంత్రం ఆఫీసర్‌గారు దిగిన లాడ్జికి వెళ్లి కలుసుకున్నాడు గురునాధం.

ఆఫీసులో ఆయన హడావిడి చేసినా- అక్కడ మాత్రం మర్యాదగానే కూర్చోబెట్టి మాట్లాడాడు.

కొంచెంసేపయ్యాక- "సార్... ఈ ఊరు కందిపప్పుకి మహా ప్రసిద్ధి. ఇదిగో... శాంపుల్‌గా రెండు కిలోలు తెచ్చాను- చూడండి!" అంటూ సంచి ఆయన చేతికి అందించాడు గుర్నాధం.

ఆఫీసర్‌గారు సంచిలోని కందిపప్పుని తీసుకుని వాసన చూసి, కంటితో పరీక్షించి- "పప్పు బాగుందే... ఎంతేమిటి కిలో?" అని అడిగారు.

"ఎంతోనా... కిలో నాలుగు రూపాయలు! ఇదే బయటయితే ఎనిమిదిన్నరకి తక్కువలేదు" అన్నాడు ఉత్సాహంగా గుర్నాధం.

"అలాగా! అయితే... ఒక బస్తా పంపించండి. మీరు పంపగానే డబ్బు పంపిస్తాను" అన్నారు ఆఫీసర్‌గారు.

గుర్నాధం గుండెల్లో రాయి పడింది.

"అలాగే సార్..!" అంటూ నీళ్లు నమిలి బయటపడ్డాడు.

'కిలో ఎనిమిదిన్నరకి కొని సమర్పించుకుంటే బస్తాడు పప్పు కావాలంటాడు. నా నడుం విరక్కొట్టాడు. నాయనో!' అనుకుంటూ లోలోపలే గొల్లుమన్నాడు.

- విజయ భేరి... విజయోత్సవ సంచిక '84